


ట్రెయిన్ రెండు గంటలు లేటు. 'హమ్మయ్య' అనుకున్నాను.

"చూశావా నా అదృష్టం! నీతో రెండు గంటలు సరదాగా గడపొచ్చు" అన్నాను.

"ఛీ అన్నీ వెధవ్వేషాలు" ముద్దుగా విసుక్కుంది వనజ.

"ప్లాట్‌ఫారం చివరగా ఎక్కడన్నా మంచిచోటు చూసుకుని కూర్చుందాం పద" అన్నాను, సూట్‌కేస్ చేతిలోకి తీసుకుంటూ.

వనజ కళ్ళు పెద్దవి చేసి కోపంగా చూసింది. "నీ కసలు బుద్ధుందా? ఇప్పుడే ఏడిమిదైంది. మరో రెండు గంటలంటే బాగా రాత్రవుతుంది. అసలే మా అమ్మకు చచ్చే అనుమానం. నేను వెళ్ళిపోతాను, బాబూ!"

'వెధవ నాటకం—వీళ్ళమ్మకు దీని సంగతి పెద్ద తెలియనట్లు.' మనసులో విసుక్కుని, పైకిమాత్రం "మా అమ్మవి కదూ, వో అరగంట చాల్లే" ప్రతిమాలాడుతూ వనజ చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

"నీ గురించే తప్ప ఎదుట వాళ్ళగురించి ఆలోచించవు. సరే వస్తాను గానీ, ఏమన్నా కొంటె వేషాలు వేస్తేమాత్రం ఒక్క క్షణం కూడా ఉండను. ముందు చెయ్యి వదులు" అంది, విసురుగా చెయ్యి లాక్కుంటూ.

ఇద్దరం జన సందోహానికి బాగా దూరంగా వో సిమెంట్ బెంచీ మీద కూర్చున్నాం. చీకటి. వనజ తలలో తురుముకున్న సన్న జాజీల పరిమళం. చీకట్లో కూడా తెల్లగా పాలరాతి బొమ్మలా సన్నగా మెరుస్తున్న వనజ శరీరం. నా నరాలు జివ్వుమంటున్నాయి.

"నిన్ను చూడకుండా పది రోజులు గడపాలంటే దిగులుగా ఉంది. నాకు ఒక్కోసారి ఆశ్చర్యమేస్తుంది. మూడు నెలల క్రితం నువ్వెవరివో తెలియదు. ఈ రోజు నిన్ను చూడకుండా బ్రతకలేకపోతున్నాను. మా అమ్మ ఈ మధ్య ఆలస్యంగా ఇంటికి వస్తున్నందుకు ప్రాణాలు తోడేస్తోంది. అబద్ధాలు చెప్పలేక తలప్రాణం తోకకు వస్తోంది. ఎలాగూ ఇంటికెళ్తున్నావు కదా—మన పెళ్ళిమాట తేల్చుకు రాకూడదూ?"

మనసులో అసహనాన్ని దాచుకుంటూ జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాను. పెళ్ళిళ్ళ మార్కెట్‌లో నా రేటు దాదాపు యాభై వేలు. ఉద్యోగం చిన్నదే కాని, నా అందానికి సగానికి సగం రేటు వచ్చేస్తోంది. పైసా కట్నం ఇవ్వలేదు. ఉద్యోగం మాద్దామంటే డెయిలీ వేజెస్ మీద ఏదో కంపెనీలో పనిచేస్తోంది. తళుకులు బెళుకులు చూపించి, వలలోకి లాక్కుని తేలిగ్గా మెడలో పసుపుతాడు వేయించేసుకోవాలనుకుంటోంది. ఇలాంటి కేసులు చాలా చూశాను.

అసలు ఏ ఆడదాన్నీ నేను మూడు నెలలకు మించి వేటాడను. మొదటి నెలలో బాడీగార్డులా అనుసరించడం, రెండో నెలలో ఓరచూపులు, నవ్వులు, పలకరింపులు. మూడో నెలలో పక్కమీదికి. కొన్ని కేసులు నెల తప్పడం కద్దు. బెదిరిస్తారు. శపిస్తారు. ఏడుస్తారు. అంతే అంతకంటే నన్నెవరూ ఏమీ చేసింది లేదు, అది ప్రకృతి మగవాడికి ఇచ్చిన వరం.

ఆడవాళ్ళని చూస్తే ఒక్కోసారి జాలేస్తుంది. అతి దీనంగా మొహం పెట్టి "నువ్వులేని నా జీవితం లేదు" అని దేవదాసు పోజు పెడితే చాలు కరిగిపోతారు. ముందు బెట్టు చేసినా, తర్వాత మెల్లగా దారికొస్తారు—ఎవరో కొద్ది మంది తప్ప.

అఖరికి ప్రేమ దగాకి భిషతో నిమిత్తం లేదని నిరూపించాను. గీత—శ్రీనివాస అయ్యంగారి గీత. గీతకి తెలుగు రాదు. నాకు అరవం రాదు. కొత్తగా ఆ వూరికి ట్రాన్స్‌ఫరై వచ్చాడు అయ్యంగారు. ఆయనకు కాంప్ లెక్కువ. మేడ మీద రూమ్‌లో నేను. క్రింది వాటాలో ఆ కుటుంబం. నీళ్ళకోసం నేను క్రిందకు వెళ్ళాల్సి వచ్చేది. అక్కడ కనబడేది గీత—చెట్లకి నీళ్ళు పోస్తూనో లేకపోతే నీళ్ళు తోడుతూనో. పెద్ద పెద్ద కళ్ళతో, ఎర్రంగా, లేత చిగురుటాకులా సున్నితంగా ఎంతో ముద్దొచ్చేది. అయ్యంగారి భార్యకి తొమ్మిది మంది సంతానంతో క్షణం తీరేది కాదు.

ఆ స్వీట్ సిక్స్‌టీన్‌ని మచ్చిక చేసుకోవడానికి చాలా తంటాలు పడ్డాను. మొదట్లో చెయ్యి ముట్టుకున్నా ఏడ్చేసేది. తర్వాత ... తర్వాత ..


చాలా రోజులు ఈ గ్రంథం నడిచిన తర్వాత, గీత నెల తప్పింది

నా చేతుల మధ్య ఒదిగి ఎంతో అపురూపమైన విషయంలా—"పువ్వోడు బేబీ వయసు మూను మాసం" అంది, తన పొట్ట మీద సున్నితంగా స్పృశిస్తూ. ఆ కళ్ళల్లో భయం లేదు, విపరీతమైన నమ్మకం తప్ప.

నేను స్థిరంగా అన్నాను. "ఎబార్షన్" అన్నతర్వాత గిల్టీగా అప్పగించింది గీత మొహం చూసి, ఎప్పుడూ లేనిది.

ఆ మాట వింటూనే దిగ్గున లేచి నిలబడింది గీత. నేలమీద చతికిలబడి కళ్ళూ, మొహం మందారాల్లా ఎర్రబడేలా కుళ్ళికుళ్ళి ఏడ్చింది. ఆవేశం తగ్గిన తర్వాత నా కాళ్ళు పట్టుకుంది. మొత్తుకుంది విదిలించి పారేశాను. అది జరిగిన తర్వాత అయ్యంగారు నా మీద తగువు కొస్తారనుకున్నాను.

కాని, వూహించని విధంగా వారం రోజుల తర్వాత వాళ్ళ చెల్లిని దగ్గర్లోనే ఉన్న స్కూలుకి దిగబెట్టి వస్తూ లారీ క్రింద పడి చచ్చిపోయింది గీత. చూసిన వాళ్ళంతా లారీవాడిది తప్పుకాదన్నారు. అంటే గీత



# వలలో వేటగాడు

జాగర్లమూడి స్వర్ణలత

కావాలనే తన అమాయకత్వానికి శిక్ష విధించుకుందన్నమాట. ఆ పిల్ల మూర్ఖత్వానికి చిరాకేసింది. రూమ్‌లో కాలు పెట్టగానే ఓ కాగితం రెపరెపలాడుతూ కనిపించింది. కిటికీకో తెల్లటి కాగితం మీద చుట్టచుట్టుకుని ఉన్న కొండ చిలువ బొమ్మ. మొహం మాత్రం మనిషిది. నోటికో రేకులు రాలిన గులాబీ తొడిమె. క్రింద గీతారాణి సంతకం—తెలుగు అక్షరాలతో. నా కోసం తెలుగు అక్షరాలు నేర్చుకుంటానంది. నేర్చుకుందన్నమాట. భాష రాదు. కాని,నన్ను తిట్టాలి. పూర్ బేబీ. పెదవి విరిచి కాగితం చింపి అవతల పారేశాను.

రాత్రిళ్ళు వుండుండీ వాళ్ళమ్మ ఏడుపులు, గీతతో నేను గడిపిన క్షణాలు — స్థిమితం చిక్కక ఆ రూమ్ ఖాళీ చేశాను.

అలా చాలా అనుభవాలు...

కాని ఈ వనజ మాత్రం కొరకరాని కొయ్యలా తయారైంది. లాభంలేదు. మానేద్దా మనుకున్నాను కాని ఆ అందం ... పిచ్చికుక్కలా వేటాడుతోంది. ఒక్కసారి ఆ పాలరాతి ప్రతిమని రుచి చూడాలి. అందుకే కొనసాగిస్తున్నాను పోపిగ్గా—నా ఆఫీస్ అడ్రస్ తెలియనివ్వకుండా, ఫోను నెంబరు తెలియనివ్వకుండా, నా గురించి ఏమీ తెలియనివ్వకుండా. ఇద్దరికీ బస్సులో పరిచయం. నాది ఊరి చివర ఆఫీసు నే నెక్కిన రెండు స్టాపుల తర్వాత ఎక్కుతుంది వనజ. మధ్యలోనే దిగిపోతుంది. సాయంత్రం మాత్రం తప్పకుండా ఎనిమిది గంటల వరకూ సినిమాలకు, పార్కులకు తిరుగుతాము.

మా వాళ్ళ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది—నాకేదో సంబంధం వచ్చిందని, పెళ్ళి చూపులకి రమ్మని. అందుకే ఈ ప్రయాణం. స్టేషన్‌దగ్గర్లోనే వనజా వాళ్ళిళ్ళు. నన్ను సాగనంపడానికి వచ్చింది. వనజ అమాయకత్వానికి నవ్వొస్తోంది. ఎంత తేలిగ్గా మగవాళ్ళని నమ్ముతారీ పిచ్చి ఆడవాళ్ళు!

వనజ ఏదో చెప్తూనే వుంది. నా మీద తన కున్న మమకారం గురించి, నేను లేకపోతే తను ఫీలయ్యే లోటు గురించి. భావి జీవితాన్ని గురించి చెప్తోంది. ఏదో ఒకటి చెప్పకపోతే బావుండదుకాబట్టి నేనూ అన్నాను—"వెళ్తున్నానే గాని, నా నరనరంలో ప్రతీ రక్త కణంలో నువ్వే వనజా!" అన్న తర్వాత నాకే అనిపించింది పచ్చి డైలాగ్ అని.

వనజమాత్రం నిండుగా నవ్వింది. "నాకు కావలసింది అదే, శ్యామూ!" అంది. నా పేరు శ్యామసుందర్రావు. మరీ ప్రేమ ముంచుకొస్తే శ్యామూ అంటుంది వనజ. ఆ మూడ్‌ని వదల దలచుకోలేదు నేను. మెరుపులా ఆమెని గుండెల దగ్గరికి లాక్కుని కౌగిట్లో బందీని చేసి పెదవులు అందుకున్నాను. నా వీపు మీద ఆమె చేతివేళ్ళ వణుకు, అరమూతలు పడ్డ ఆ కళ్ళు — ఫర్వాలేదు. తొందర్లోనే అందుతుందనిపించింది.

• • • •

పేరు బాలా త్రిపురసుందరి. నల్లగా ఉన్నా, లక్ష్మీకళ ఉందట. లావుగా ఉన్నా నిండుగా ఉందట. ముఖ్యంగా నన్నెక్కడో చూసి మనసు పడిందట. పాతిక ఎకరాల సుక్షేత్రం. బోలెడు బంగారం, చాలా బాంక్ బాలెన్స్. లంకంత కొంప. ఆమే వారసురాలు. మా వూరికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న గుంటుపాలెం వాస్తవ్యురాలు. ఆ వూర్లో నాకు వేలు విడిచిన మామయ్య ఒకడు ఈ సంబంధాన్ని పట్టుకొచ్చాడు.

మంచి రోజు చూసుకుని పెళ్ళి చూపులక

వెళ్ళాం. సినిమా సెట్టింగ్ లా ఉంది ఇల్లు. ఆ మర్యాదలు, ఇంట్లో తాండవమాడుతున్న ఐశ్వర్యం ఉబ్బి తబ్బిబ్బయ్యాం.

పిల్లని తీసుకొచ్చి కూర్చోబెట్టారు. చూడగానే ముందు మా బంధువుని చెప్పు తీసుకుని కొడదామా అన్నంత కోపం వచ్చింది. సుందరి అని ఎలా పేరు పెట్టారో గాని కాగడా వేసి వెతికినా సౌందర్యం కన పడదు ఆవిడలో. తారుడబ్బాకి జరీ ముద్దలాంటి పట్టుచీర చుట్టబెట్టి, ఏభై కాసుల బంగారం తగిలించినట్టుంది. అమ్మా, అక్కయ్యా ఆవిడ ఒంటి మీద బంగారాన్ని, అందులో పొదిగిన రాళ్ళని, కెంపుల్ని బొమ్మల్లా చూస్తున్నారు. నాన్న గారి మొహంలో మాత్రం చిరాకు అలుముకుంది. నా కర్థ మైంది—ఆయనకి బొత్తిగా నచ్చలేదని.

ఎలా ఈవిడ్ని పెళ్ళిచేసుకోవడం? కాపురం చెయ్యడం? పిల్లల్ని కనడం? హటాత్తుగా వనజ గుర్తుకొచ్చింది. సుందరి ఒంటి మీద బంగారాన్ని ముద్దచేస్తే వనజ అవుతుంది. అపురూపమైన అందం. ఆ అందం సొంతం చేసుకుంటే కొన్ని రోజులు ఆనందం. తర్వాత పెరిగే సంసారం, వాసి తగ్గే అందం. బ్రతుకుని చావగొట్టే ఆర్థిక సమ స్యలు. నరకం ...! అదే సుందరి అయితే ... లక్షాధికారి శ్యామసుందరరావుగారు డబ్బులో ఈత కొట్టొచ్చు. నా వివేకం మేల్కొంది. సుందరి బదులు నోట్ల కట్టల గుట్ట కనబడటం మొదలె ట్టింది. కరెన్సీ నోట్ల రెపరెపల మధ్య సుందరెంత అందంగా కనబడుతోంది! నేను తెలివిగా వ్యవహరించి, వచ్చిన ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించు కోవాలి. మిగిలిన వ్యవహారాలు కట్టిపెట్టి ఒక్క వనజనే నమ్ముకోవాలి. ఓ సారి నా స్వాధీనం అయిందంటే నా చేతిలో కీలుబొమ్మ.సుందరిదేముంది? మొదట్లో కొంచెం కోప్పడుతుంది. తన చేతుల్తో తన్నే భర్తని వేశ్య యింటికి మోసు కెళ్ళిన పతివ్రతల వారసురాలు రాణికి రాక చేసేదేముంది? డబ్బు మూటలు అందించే భార్య. అందమైన ప్రియురాలు. ... శ్యామ్ బ్రతుకంటే నీదిరా. నిర్ణయాని కొచ్చాను.

అందుకే నాన్నగా రెంత చెప్పినా వినకుండా సుందరిని పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్నాను.

పెళ్ళయిపోయింది ఆర్భాటంగా. శ్రావణంలో సుందరి కాపరాని కొచ్చింది ఘనమైన సారెతో. నాలుగు రోజు లుండి మా అత్తగారు, మామగారు వెళ్ళిపోయారు. వెళుతూ కూతురి చేతిలో ఖర్చులకు ఉంచుకోమని బాంక్ పాస్ బుక్, చెక్కు పుస్తకం పెట్టి వెళ్ళారు.

నేను పొద్దుటే ఆఫీసుకు వెళుతూంటే అడిగింది సుందరి. "సాయంత్రం తొందరగా రండి. సినిమా కెళదాం. అక్కినేని సినిమా అంటే నాకు బోలెడు ఇష్టం."

"ఇన్ని రోజులు ఆఫీసు పని పెండింగ్‌లో ఉండి పోయింది. సుందరా" అన్నాను.

ఆ మాత్రానికేసుందరి కళ్ళల్లోకి కన్నీరు చేరింది.

"వెధవ ఆఫీసు. మానెయ్యండి. హాయిగా మన పూరు వెళ్ళిపోతే ఈ ముష్టి జీతంతో లెక్కేమిటి?" అంది—నా దగ్గరగా వచ్చి గోముగా నా చుట్టూ చేతులు వేస్తూ.

"ఇల్లరికం నా కిష్టం లేదు." ముభావంగా అన్నాను, ఆ చేతుల్ని తప్పించుకుని బయటికి నడుస్తూ.

సుందరి మొహం చిన్న బోయింది.

సాయంత్రం వనజతో సినిమా చూసి తనని ఇంటి దగ్గర వదిలి ఇల్లు చేరుకునే సరికి పది దాటింది. ఒక్క పిలుపుకే వచ్చి తలుపు తీసింది సుందరి. తెల్లటి చీర, తలలో పరిమళాలు వెదజల్లుతున్న విరజాజులు.

"వెధవది ఆఫీస్ పని" అన్నాను సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లుగా.

సుందరి ఏమీ అనలేదు. నా దగ్గరగా వచ్చి విప్పిన షర్ట్ అందుకుంది.

నేను లుంగీ లోకి మారే లోపునే వేడి వేడి నీళ్ళు స్నానానికి సిద్ధం చేసింది. స్నానం చేసి వచ్చేసరికి అన్ని వంటకాలు వేడిగా వడ్డించింది. అలసట, నిద్ర మత్తు...అదరా బాదరాగా నాలుగు ముద్దలు తిని



గదిలో కెళ్ళిపోయాను. కాసేపటికి సుందరి గదిలోకి వచ్చింది. కళ్ళల్లో కన్నీరు "అదేం?" అన్నాను అసహనంగా.

"మీ కోసం చూస్తూ కూర్చున్నాననికూడా మీరు గుర్తించ లేదు. కనీసం 'నువ్వు భోజనం చేశావా' అన్న చిన్న పలకరింపుకూడా లేదు." ఏడిచింది సుందరి.

అలాంటి వెధవ సెంటిమెంట్లంటే నాకు మహా చిరాకు. కాని కొత్తలోనే బెదర గొట్టడం బాగుండదు కాబట్టి—"సారీ. భోజనం చేసిరా" అన్నాను.

"వద్దులెండి. ఆ మాట చాలు" అంది నా పక్కనే చోటు చేసుకుని పడుకుంటూ.

భర్తగా తప్పదు. అయిష్టంగా, విసుగ్గా ఆమె దగ్గిరికి జరిగాను.

● ● ● ●

చాలీచాలని జీతంతో, గాలీ, వెలుతురూ సరిగ్గా రాని ఒక చిన్న గదిలో ప్రతీ ఖర్చుకీ అణా పైసలు లెక్క వేసుకుంటూ బతికే గానుగెద్దు లాంటి జీవితం నుంచి సుందరి పుణ్యమా అని బయట పడ్డాను. చేతినిండా డబ్బు. పెద్ద ఇల్లు తీసుకున్నాను. ఖరీదైన ఫర్నిచర్, బట్టలు కొన్నాను. ఫారిన్ వాచీ, స్కూటర్, వేళ్ళకు ఉంగరాలు వచ్చాయి. ఫైవ్‌స్టార్ హోటల్ తప్ప మామూలు వాటి వైపు కన్నెత్తి చూడటం మానేశాను. సుందరి డబ్బు విషయంలో ఎలాంటి అభ్యంతరం చెప్పదు. ఆమె కోరుకున్న దొక్కటే. నా నమ్మకం. ఆలస్యంగా వచ్చినా, ఆప్యాయంగా పలకరించకపోయినా చాలు—కన్నీళ్ళు ఇట్టే వచ్చేస్తాయి. కన్నీళ్ళ దేముందిలే! ఆ కాసేపు నోరు మూసుకుంటే చాలు మామూలైపోతుంది.

ఇంటి దగ్గర మంచి పోషణ, బయట వనజతో తీరుతున్న సరదాలు...నా జీవితం వడ్డించిన విస్తరిలా, పంచరంగుల కలలా హాయిగా గడిచిపోతుంది.

ఒకటే కాస్త బాధగా ఉంది. వనజ ఇంకా నా సొంతం కాకపోవడం. వనజకి అన్నీ అనుమానాలే. "ఇంట్లో డబ్బుల చెట్టు మొలిపించావా? లేకపోతే ఏమిటి నీళ్ళలా డబ్బు ఖర్చు చెయ్యడం?" అంది, నేను తన బర్త్‌డేకి బంగారు గొలుసు ప్రజంట్ చేస్తే తీసుకోకుండా.

దగ్గర బంధువొకాయన ఆస్తంతా నా పేర్న రాసి, బాల్చీ తన్నేశాడని అబద్ధ మాడేశాను. వనజ నమ్మింది. ఎంతో బతిమలాడితేనే గాని, నే నిచ్చిన బహుమతి తీసుకోలేదు. అదేం మనిషో! ప్రేమతో కూడిన చిన్న చిరునవ్వు చాలంటుంది. కలో గంజో కలిపి పంచుకుంటే అంతకు మించి లేదంటుంది. ప్రేమ కూడు పెడుతుందా— కథల్లో చదవడానికి బాగుంటుంది కాని?

ఇనుమైనా వేడి తగిలితే కరగక తప్పదు. నీతీ, నిజాయితీ అంటూ చిలక పలుకులు పలికే వనజ క్రమంగా దారిలో పడుతూంది.


ఆ రోజు ఎగ్జిబిషన్‌కి వెళదామంది వనజ. సరే నన్నాను. ఇద్దరు చేతిలో చెయ్యి వేసుకుని ఈ భూమ్మీద ఉన్నది మేమిద్దరమే అన్నంత వివశత్వంతో ఎగ్జిబిషన్ అంతా చెడ తిరిగాం. వద్దని మొత్తు కుంటున్నా వనజకి ఖరీదైన గంధపు బొమ్మ కొని ప్రజెంట్ చేశాను. వచ్చేయ బోతుంటే నా కంట పడింది జెయింట్ వీల్. జెయింట్ వీల్ ఎక్కడ మనేది నేను వదులుకోలేని సరదా! అదే నా జీవితాన్ని కుంపటిలో వంకాయలా కాలుస్తుందని తెలుసుంటే కన్నెత్తి చూసేవాడిని కాను.

వనజ రానంటే రానంది. నే నొక్కడినే ఎక్కాను, వనజతో ఎంజాయ్ చేసే ఆ క్షణాల్ని పోగొట్టు కున్నందుకు బాధ పడుతూ పాప్‌కారన్ నములుతూ వనజ అక్కడే ఉన్న వచ్చికలో కూర్చుంది. నేను తిరిగి వచ్చేసరికి వనజ కనిపించలేదు. వెతికి వెతికీ విసుగెత్తి, చేసేది లేక ఇంటికి వచ్చేశాను. తలుపు తట్టగానే వెంటనే హాజరయ్యే సుందరి చాలా ఆలస్యంగా వచ్చి తీసింది. కన్నీళ్ళతోనో, అవధుల్లేని ప్రేమతోనో నిండి ఉండే ఆ కళ్ళల్లో నే నెప్పుడూ చూడని తీక్షణత! ఆశ్చర్యపడుతూ లోపలికి వచ్చాను.


సుందరి ఒక్క మాట కూడా మాట్లాడకుండా వెళ్ళి ముసుగుతన్ని పడుకుంది. నేనే అన్నీ వెతుక్కుని, చప్పగా చల్లారిపోయిన వంటకాల్ని ఎలాగో తిన్నా


# పచనోల్

ఎల్లప్పుడు ప్రశస్తమైనదిగా రుజువైంది.




రోజు[illegible]కు కడుపులో వచ్చే
బా[illegible]ను నివారించుకోండి



భోజనం చేసినప్పుడు ఒక్కొక్కప్పుడు అతిగా తినటం జరుగుతుంది. దానితో మర్నాటి నుంచి కడుపులో గడబడ మొదలవుతుంది. అయితే గాబరాపడకండి. ఎల్లప్పుడు పచనోల్ దగ్గర ఉంచుకోండి. ఎందుచేతనంటే అజీర్ణం, గుండెలో మంట, కడుపులో గ్యాస్ ఏర్పడటం, పులితేనుపులు, ముందు ముందు వచ్చే ఉదర వ్యాధులు వీటిని త్వరితంగా నయంచేసి, ఉపశమనం కలిగించే పదార్థాలు ఇందులో ఉన్నాయి.

భోజనంచేసిన వెంటనే విధిగా పచనోల్ బిళ్ళలు సేవించండి.

Hamdard

## పచనోల్

కడుపులోని రుగ్మతలకు ప్రతిష్ఠమైన, సత్వర చికిత్స

HTD-HWL-7373

వచ్చించాను. వెళ్ళి సుందరి పక్కన చోటు చేసుకో బోయాను. సుందరి చటుక్కున లేచి నిలబడి నన్ను పురుగులా చూసి అవతల గదిలో కెళ్ళిపోయి, తలుపులు ధఢీమని మూసేసింది.

దిమ్మెరపోయాను. నా ప్రశ్నే మహాభాగ్యంలా తాకి తేనే పెన వేసుకునే సుందరికేమైంది? నాకు మతి పోయింది.

ఫ్రిజ్‌లోంచి బ్రాందీ బాటిల్ ఒకటి తెచ్చుకుని తాగి పడుకున్నాను. తాగుడు మునుపు హాబీ. ఇప్పుడు అలవాటు. తెల్లారిన తరవాత ఎండ చురుక్కుమనిపిస్తుంటే మెలుకువ వచ్చింది. సుందరి అలాగే పడుకుని ఉంది. పలకరించ బుద్ధి కాక ముభావంగా నా పని నేను చేసుకుని ఆఫీసుకు వెళ్ళిపోయాను. వనజ బస్సులో కనిపించలేదు. సాయంత్రం చాలాసేపు వేచి చూశాను కాని, కనిపించలేదు.

ఇంటి దారి పట్టాను. సుందరి ఇంకా అలకపాన్పు దిగలేదు. వంట కూడా చెయ్యలేదు. నాకు మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా తలుపులు బిగించుకుంది.

నాలుగురోజులు గడచిన తరవాత ఆ రోజు సాయంత్రం ఇంటికొచ్చే సరికి ఇంటిముందు లారీ ఆగి ఉంది. వరండాలో ఎరకోసం మాటు వేసిన పులిలా మా మామగారు! ఇప్పు డెందుకొచ్చాడా అని విస్తుపోతూ లోపల అడుగు పెడుతూంటే మా అత్తగారు నన్ను చూస్తూనే శోకాలు అందుకుంది.

నా కాళ్ళ కింద భూమి కదిలినట్లయింది. సుందరి ఏ అఘాయిత్యమో చెయ్యలేదు కదా? చస్తే చచ్చింది. నేనే కారణమని ఏదైనా రాసిపోతే కొంపదీసి!

"ఎందుకే ఏడుస్తావు? నా కూతురికేం తక్కువ! వీడు కాకపోతే మరొకడు. రాజాలాంటి వాడ్ని తీసుకు రానూ?" మామగారి రంకెతో అదేం కాదని తెలిసి స్థిమితపడ్డాను. అప్పుడు గమనించాను—ఇల్లు అయ్య వారి నట్టిల్లులా ఉందని.

"డబ్బుకి ఆశపడి నా కూతురి బతుకు బండలు చేస్తావట్రా? మరో వన్నెల విసనకర్రతో తిరుగుతూ, దాన్ని పెళ్ళాడానికి కూడా సిద్ధమయ్యావా? నా కూతురి ప్రాణాలు తీద్దామనుకున్నావా తరవాత? కాపురం పెట్టిన రోజు నుండి నా చిట్టి తల్లి ఏడవని రోజే లేదట. గోగుంటపాలెం గురవయ్య అంటే ఆ చుట్టుపక్కల పిట్టలు కూడా నీళ్ళు తాగవు. ఇంతవరకూ నువ్వు వాడుకున్న డబ్బుని మర్యాదగా ఇవ్వు. పెళ్ళి ఖర్చుల కని ఒక పదివేలు, నీ ఖర్చుల కో పదివేలు తగలేశాం. ఇవ్వకపోతే మీ వాళ్ళకి పచ్చిగంగ కూడా దొరకనివ్వను. జాగ్రత్త. నన్నే ఆడిద్దామను కున్నావా? అస లీ జన్మలో నీ పెళ్ళి జరగనివ్వను. విడాకుల కాగితం పంపిస్తాను. సంతకం గీకి పంపించు" అని నాకు నానా గడ్డి పెట్టి, "సర్దడం అయిందా? పదండి. ఈ దగుల్బాజీ ముందు నిలబడా లంటేనే వళ్ళు మండిపోతూంది" అని గురవయ్య గారు రెండు వీధుల కవతలకి వినపడేలా నన్నూ, నా వంశాన్నీ నానా మాటలతో దుమ్మెత్తి పోశారు.

నా కంతా అయోమయంగా ఉంది. నాకు తెలుస్తున్న దొక్కటే—సుందరి తెగతెంపులు చేసుకు పోతూందని!

సుందరి వెళ్తూ వెళ్తూ నా దగ్గర ఆగి నిలబడి అంది: "వంచన అంటే నాకు పరమ అసహ్యం. జీవితంలో నటించిన నీ కంటే ఆ నటన నిజమనుకుని మనసునీ, శరీరాన్నీ మనస్ఫూర్తిగా అర్పించి ఆ క్షణాల్లో జీవితం ధన్యమైందనుకుని పిచ్చిదానిలా మురిశానే... నా కే శిక్ష, బాధ ఎక్కువ. కాని, నీలాటి వెధవ గురించి నా బతుకు పాడు చేసుకోను. నువ్వు కట్టిన మంగళసూత్రాలు పోపుల డబ్బాలో ఉన్నాయి. మీ కాబోయే ఆవిడకి పనికొస్తాయి."

"సుందూ . . . అది కేవలం స్నేహం."

"ఛీ . . .ఛీ . . ." ఛీదరించుకుంది సుందరి. "నా మనసు విరిగిపోయింది. నీ నుంచి ఏమీ విన దల్చుకోలేదు నేను. నా కళ్ళే నన్ను మోసం చెయ్యలేవు. దయచేసి నిన్ను మళ్ళీ చూసే దురదృష్టానికి గురి చెయ్యొద్దని నా ప్రార్థన. గుడ్ బై." సుందరి వెళ్ళిపోయింది.

నేను రావడం ఆలస్యమైతే పిచ్చి దానిలా ఏడ్చే సుందరి, నా పాదధూళే శిరోధార్యంగా భావించిన సుందరి ... ఎంత తొందరగా, ఎలాంటి అవమానం చేసి వెళ్ళిపోయింది. ఛీ...ఛీ... ఆడవాళ్ళు బొత్తిగా

లిమ్కాతో అనుక్షణం
సేదతీరును మరుక్షణం

దప్పికా? ఐసోటానిక్ లవణములు గల లిమ్కా దానికి సమాధానము. మిమ్మల్ని రంజింపజేసే నిమ్మకాయల పుల్లదనమే కాకుండా ఈ సేదతీర్చే పానీయంలో సి విటమిను కూడ కలదు.




RADEUS/PE/L/17-82

పతి(వతా ధర్మాలు మరిచిపోతున్నారు. అందుకే దేశం ఇలా తగలడిపోతూంది. ఇరవై వేలు ఎక్కడ్నించి తేను? ఏం జరిగిం దసలు? ఆ వనజ కూడా కనబడి చావడం లేదు. ఎంత ఖర్చు పెట్టాను దాని మీద' దా వ్వయినా మంచి చేసుకుని పెళ్ళి చేసుకుంటే సరిపోతుంది. ఏదో వేన్నీళ్ళకి చన్నీళ్ళు. సర్దు కుపోవచ్చు. ఆ గురవయ్య అసలు నాకు పెళ్ళే కానిచ్చేలా లేడు మరి.

ఏం జరిగిందో నెల రోజుల తర్వాతగాని నాకు తెలియలేదు. ఆ రోజు సాయం(త్రం వనజ కనిపించింది. తనే ముందుగా నా దగ్గర కొచ్చింది. ''అలా పార్కులో వెళ్ళి కూర్చుందాం వస్తావా?'' అంది మామూలు చిరునవ్వుతో. ఇద్దరం వెళ్ళి పార్కులో కూర్చున్నాం.

నేను తను కనపడకపోవడంతో ఎలా పిచ్చెత్తిపోయానో గుండెలు కరిగేలా చెప్పాను. అంతా విని చాలా శాంతంగా అంది వనజ. ''మీ ఆవిడ్ని చూశాను, శ్యామ్!''

షాక్ తిన్నాను.


''నో... అసలు...''

నా మాటలు విన్పించుకోకుండా చెప్పడం మొదలుపెట్టింది వనజ. ''ఆ రోజు ఎగ్జిబిషన్‌లో జెయింట్ వీల్ ఎక్కావు, చూశావా? అప్పుడు ఒక చిన్నబ్బాయి నా దగ్గర కొచ్చి 'అక్క నిన్ను పిలుస్తోంది' అని చెప్పాడు. ఆ అబ్బాయి వెనక వెళ్ళాను. మీ ఆవిడ సుందరి కదూ. నిలబడి ఉంది. కళ్ళు ఎ(ర్రగా ఉన్నాయి. సెగలు కక్కుతున్న అగ్ని పర్వతంలా ఉంది. 'ఆయన మీకేమవుతారు?' అంది నాకు చాలా కోపం వచ్చింది. అయినా, అన్నాను 'ఎవరో ఏమిటో తెలియకుండా ఆ (ప్రశ్న అడగడం బావుండదు. రెండేళ్ళ నుంచీ (ప్రేయసీ (ప్రియులం. రెండు(రోజులాగితే కాబోతున్న ఆలూమగలం' అన్నాను గర్వంగా

అంతే, సుందరి నేలమీద కూలబడి పిచ్చిదాన్లా గుండెలు బాదుకుని ఏడ్చింది.

'నేను (బతకలేను, పిన్నిగారూ! చూశారా నన్నెంత మోసం చేశారో! ఆయన్ని నా (ప్రాణంకంటే ఎక్కువగా చూసుకున్నాను. ఆయన ఏ రోజూ (ప్రేమగా మాట్లాడకపోయినా, భరించాను. ఆయన్ని చూసుకుని (బతికాను. నన్ను డబ్బుకోసం వాడుకున్నారని తలుచుకుంటూనే గుండెలు మండిపోతున్నాయి. ఇందాకట్నించీ గమనిస్తున్నాను—ఆయనలో ఏ రోజూ నేను చూడని సంతోషం. గాల్లో పక్షిలా ఎంత హాయిగా తిరుగుతున్నారు. నా కర్థమైంది. అంతా అర్థమైంది.'

పక్కింటి పిన్నిగారు నన్ను చంపేసేలా చూసి—'పెళ్ళయినవాడితో ఇవేం వేషాలు! పచ్చటి కాపురంలో చిచ్చు పెడతావా?' అని నానా గడ్డీ పెట్టింది. ఆ క్షణంలో నాకు కలిగిన బాధ వర్ణనాతీతం. ఇంటికెలా చేరుకున్నానో నాకే తెలియదు. డబ్బు కోసం ఒక ఆడది. అందమైన అనుభవం కోసం ఒక ఆడది. అందుకే పెళ్ళి మాటెత్తితేనే మత్తు మందు జల్లేవాడివి. నన్ను మోసంచేసి ఆడిద్దామనుకున్నావు. తొందరగా కాకపోయినా, నాశనం కాకముందే కళ్ళు తెరిచాను. సుందరి సీతో కాపురం చేస్తుందనుకోను. తను చాలా సెన్సిటివ్‌లా ఉంది.''



'నాట్య భంగిమ
ఫోటో_యడవల్లి సుధాకర్

''వనజా! ప్లీజ్...''అసలు వనజ చేతులు పట్టుకోబోయాను. పురుగులా విదిలించేసింది. హాండ్ బాగ్ తెరిచి నేనిచ్చిన బహుమతులు నా మొహాన కొట్టింది.

''నాకు పెళ్ళి కుదిరింది. మా బాస్. ఆయనకి ముందే పెళ్ళయింది. ఒక పాప కూడా. చనిపోయిన భార్య పోలికలు నాలో ఉన్నాయని నన్నెంతో అభిమానించేవారు. పెళ్ళి చేసుకుంటానని ఆయన సజెస్ట్ చేసినప్పుడు 'నో' అన్నాను. ఆయన బాగా ఆలోచించుకో మన్నారు. ఆవేశం తగ్గిన తర్వాత బాగా ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చి, నా కథంతా చెప్పాను. ఆయన అర్థం చేసుకున్నారు. నువ్వు చేసిన గాయం పచ్చిగా గుండెల్ని పీకుతున్నా, ఆయన సహృదయతని దూరం చేసుకోవడం ఇష్టంలేక రాజీ పడ్డాను. తొందర్లోనే పెళ్ళి జరుగుతుంది. నేనే కొంత వ్యవధి కావాలన్నాను—మనసుని కాస్త చిక్కబట్టుకోవటానికి. అరుగో. ఆయనే...నేనే ఇక్కడికి రమ్మన్నాను.'' అంది రోడ్డుమీద అప్పుడే తిరిగిన కారు వైపు చూపిస్తూ.

రెండో పెళ్ళి వాడంటే ఏ ముసలివాడో అనుకున్నాను. కాని, హుందాగా, అందంగా ఉన్న అతన్ని చూడగానే నామనసు ఈర్ష్యతో దహించుకుపోయింది.

''తేనె పూసిన కత్తులెలా ఉంటాయో ఆయనా చూస్తారు. పరిచయం చేస్తాను. రాకూడదూ, శ్యామ్?''

నేను కోపంగా ఏదో అనబోయేంతలో—''ఒ. కే. నువ్వు రావు. గుడ్‌బై...ఫరెవర్'' అంటూ అక్కడ్నించి కదిలిపోయింది వనజ. నా కళ్ళముందే ఆమె ఎక్కిన కారు కదిలిపోయింది రాజహంసలా.

''డర్టీ డెవిల్...'' కసిగా పళ్ళు నూరుకుంటూ పార్కులోంచి బయటపడ్డాను.

తర్వాత మా నాన్న నన్ను చడ మడ తిడుతూ. నా మొహం చూపించొద్దని ఉత్తరం రాశాడు. అక్కడికీ సిగ్గు వదులుకుని ఎన్ని రాయబారాలు పంపినా సుందరి ససేమిరా కాపురానికి రాను పొమ్మంది. సుందరికి ఇవ్వాల్సిన డబ్బు ఎక్కడ్నించి తేను? బాగా వంటబట్టి పీక్కుతింటున్న ఖరీదైన అలవాట్లనెలా వదిలించుకోవడం? చాలీ చాలని జీతంతో ఈ (బతుకు నెలా ఈడ్చటం? ముఖ్యంగా గురవయ్యగారి (ప్రభావంతో ఈ జన్మలో నాకు మళ్ళీ పెళ్ళి యోగం కలుగుతుందా? నేను మనసుపడ్డ ఆడది మహారాణిలా కారులో హాయిగా తిరుగుతూంటే ఎలా ఓర్చుకోవడం? ఇంటా బయటా అందరూ నన్ను పురుగులా చూస్తూంటే ఎలా భరించడం? అన్నీ (ప్రశ్నలే, సమస్యలే!

ఆడవాళ్ళని తల్చుకోవాలంటేనే అసహ్యం వేస్తోంది. ఆడదంటేనే నాకిప్పుడు ఎలర్జీ. చిరాకు.

. ఛీ... వెధవ ఆడవాళ్ళు...! *